# కర్కోటకుడు

ఆఫీసరుగారు వస్తున్నా రనేసరికి ఎక్కడివాళ్ళక్కడ సైలెంటయి పోయారు. ఏదో దీర్ఘంగా ఆలోచించి రాస్తున్నట్లు అందరూ తలలు ఫైళ్ళలో దూర్చేసారు. తుఫానుకు ముందు ప్రశాంతతలా, భూకంపానికి ముందు నిశ్శబ్దతలా ఉంది వాతావరణం.

అటూ ఇటూ స్టాఫును గమనిస్తూ హాలు మధ్య బూట్లు టక టక లాడించుకుంటూ తన ఎ.సి. గదివేపు నడిచాడు. గది ముందు వినయంగా నిలబడి ఉన్న ప్యూను ఆయనకి సెల్యూట్ చేసి గది తలుపులు తెరిచాడు. ఆఫీసర్‌గారు లోపలికి వెళ్ళగానే స్ప్రింగ్ డోర్స్ వాటంతట అవే మూసు కొన్నాయి.

మళ్ళీ తుఫాను హోరు గాలి, భూకంపంపు భయానక శబ్దాలు, హాల్లో చోటు చేసుకొన్నాయి. అందరూ మాట్లాడుకొనేది ఆఫీసరుగారి గురించే. ఆయన ఈ మధ్యనే ఆ ఆఫీసుకు ట్రాన్స్ఫరయ్యాడు. ఆయన మనస్తత్వమేమిటో ఎవరూ సరిగా అంచనా వేయలేకున్నారు. అని మనిషి డిసెప్లెయిన్‌లో చాలా స్ట్రిక్ట్, వర్క్‌లో చాలా సిన్సియర్ అందరికీ తెలుసు. కాని ఆ స్ట్రిక్టునెస్, ఆ సిన్సియారిటీ స్టాపు జీర్ణం చేసుకోలేకు న్నారు.

మొన్నటికి మొన్న రామచంద్రయ్య అనే సీనియర్ అసిస్టెంట్ తిరుమలకు వెళ్ళాలని రెండు రోజులకు సెలవు వ్రాసుకొని వెళ్ళాడు.

"మీ సీట్లో అర్జంట్ కాగితాలు చాలా ఉన్నాయి. ఇప్పుడు ఉన్న ట్టుండి సెలవు పెడితే ఎలా" అన్నాడు ఆఫీసరు కోపంగా.

"సార్ అర్థంటనేది జీవితాంతం ఉండేదే. పిల్లవాడి వెంట్రుక లిస్తానని వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నాను సార్" అన్నాడు రామ చంద్రయ్య ఎలాగో ధైర్యం చేసి.

"అహా...! అలాగా! దేవుడిక్కడ లేడంటావా?" అని ఎదురు ప్రశ్న వేసాడు.

రామచంద్రయ్యకు మాటలు పెగల్లేదు.

"దేవుడు తిరుమలలో లేడయ్యాబాబు. దేవుడు సర్వాంతర్యామి. 'ఇందుగలడందులేడని...' అనాడే ప్రహ్లాదుడు చెప్పాడు కదయ్యా. చెప్పడమేమిటి? స్తంభంలో చూపించాడు కూడాను. నువ్వు చేసే ప్రతి పనిలోనూ దేవుడున్నాడు. ఇక వెళ్ళు" అంటూ గద్దించాడు.

రామచంద్రయ్య నసుగుతూ, చేతులు దులుపుకొంటూ "సార్... మొక్కుబడి తీర్చకపోతే దేవుడు క్షమించడు సార్" అన్నాడు విన యంగా.

"జనవరి నెలలో ఇంత చలికాలంలో చిన్న పిల్లవాడ్ని తీసుకొని కొండలమీదికి ఎలా వెడతావయ్యా ఈ నెలలో వెళ్ళావంటే పిల్లవాడికి ఖచ్చితంగా ఫ్లూ వస్తుంది. మే నెలలో సెలవు ఇస్తానులే వెళ్ళు" అంటూ తల వంచుకొని కాగితాలు చూడ్డంలో మునిగిపోయాడు.

ఇక ఈ కర్కోటకుడితో మాట్లాడి లాభంలేదని తీసుకెళ్ళిన సెలవు కాగితాన్ని భద్రంగా మరలా జేబులో పెట్టుకున్నాడు. అవమానం పొందిన ముఖంతో తిరిగి వచ్చి తన సీట్లో కూర్చొన్నాడు.

ఇలా ఒక్కొక్కరికి ఒక్కోరకమైన అనుభవాలు. ఫెస్టివల్ అడ్వాన్సు పెట్టిన రంగారావు అప్లికేషను తిరిగి పంపిస్తూ ఇంకో నెలలో పెట్టుకోమన్నాడు. ఆ సంవత్సరం ప్రమోషను లిస్టులో పోవలసిన రంగ నాథం పేరును నిలిపివేసాడు.

ఇలా ఎన్నో! ఎన్నెన్నో! ఇన్ని అనుభవాల దృష్ట్యా అందరూ ఇతన్ని 'కర్కోటకుడ'ని పిలువసాగారు. ఇతనితో ఇలా ఎంతకాలం వేగాల్నో వాళ్ళ కర్థం కావడంలేదు. ఎప్పుడు ఇతనికి ట్రాన్స్ఫర్ వస్తుందా ఎప్పుడు ఇతని చెర వదులుతుందా అని స్టాఫు ఎదురు చూడసాగారు.

రోజులు గడుస్తున్నాయి. అన్నిరోజుల్లాగ కాక ఆ రోజు ఇంకా హడావుడిగా వున్నారు స్టాఫు అందుకో బలమైన కారణముంది. రెండు రోజుల క్రితం సరిగ్గా సాయంత్రం నాలుగు గంటలప్పుడు తమ కొలీగ్ ఆనందరావింట్లో అగ్నిప్రమాదం జరిగింది. చాలా విలువయిన వస్తువులు ఆ మంటల్లో కాలిపోయాయి. ఆనందరావు హడావుడిగా ఆఫీసరుతో కూడా చెప్పకుండా వెంటనే వెళ్ళిపోయాడు. తామూ వెళతామని ఆఫీసరుగారిని అడిగిన స్టాఫుకు అయిదయ్యేంత వరకు ఒక్కరూ కదలడానికి వీలులేదని జవాబొచ్చింది.

ఇలాంటివాడిని స్టాఫు కర్కోటకుడు, నిర్దయుడు, రాక్షసుడు అని పిలువక మరేమని పిలుస్తారు? అయితే ఈ రోజు జీతాలు యిచ్చేరోజు. సాయంత్రం మూడు గంటల నుంచి కాషియర్ వెంకటేశం అందరికీ జీతం బట్వాడా చేస్తున్నాడు. పక్కనే మరో కుర్చీలో కూర్చొని ఉన్న నటేశం ఒక్కొక్కరి దగ్గర యాభయ్ రూపాయలు వసూలుచేస్తూ వాళ్ళ పేర్లు వేరే కాగితం మీద వ్రాసుకోసాగాడు.

వాళ్ళ ఉద్దేశం ఇలా కొంత వసూలు చేసి ఆనందరావుకి ఆర్థికంగా సహాయం చేయాలని. అందరికీ జీతం బట్వాడా చేయడం, అందరి దగ్గరా వసూలు చేయడం అయిపోయింది. మొత్తం నాలుగువేల రూపాయలు వసూలయింది ఇక జీతం బట్వాడా చేయవలసింది ఆఫీసరుకు, వసూలు

చేయవలసింది ఆఫీసరు దగ్గర నుంచే, పిల్లి మెడలో ఎవరు గంట కడతారు?

నటేశం నాక్‌గా తప్పుకొన్నాడు. ఇక భారమంతా వెంకటేశం మీద పడింది. స్టాంపు అంటించి ఉన్న అక్విటెన్సు రిజిష్టరు ఒకచేత్తో... కాష్ వున్న కవరు ఒక చేత్తో, పట్టుకొని ఆఫీసరు గదిలోకి అడుగు పెట్టాడు.

"సార్! తమరి జీతం నాలుగువేల రెండువందలా యాభయ్" అంటూ కవరు వినయంగా అందించాడు.

ఆఫీసరు దాన్ని అందుకొని జేబులో పెట్టుకొని వెంకటేశం అందించిన రిజిస్టరులో సంతకం పెట్టాడు.

వెంకటేశం ఇంకా అలాగే నిలబడి ఉండడం గమనించిన ఆఫీసరు 'ఏం' అన్నట్లు కళ్ళెగరేసాడు.

"మొన్న ఆనందరావింట్లో ఫైరాక్సిడెంట్ జరిగి చాలా వస్తువులు కాలిపోయాయి సార్..." అంటూ ఆగాడు వెంకటేశం, ఆఫీసరుగారి చూపులకు గొంతు కేదో అడ్డం పడట్లయి.

"అయితే ఏం" అన్నాడు అలాగే చూస్తూ.

"మేమంతా తలాకొద్దిగా చందావేసుకొన్నాం సార్."

"మంచిది" అని తల ఆడించి తల వంచుకొని పేపర్లు చూడ సాగాడు.

కొద్దిసేపు నిలబడ్డ వెంకటేశం ధైర్యం తెచ్చుకొని "సార్" అన్నాడు మళ్ళీ.

"మళ్ళీ ఏ మొచ్చింది" అన్నాడు ఆఫీసరు తలెత్తి. "మీరుకూడా

కొంత చందా వస్తే" అన్నాడు ఏదయితే అదవుతుందనే మొండి ధైర్యంతో.

"నేనివ్వనయ్యా" ఖచ్చితంగా చెప్పాడు ఆఫీసరు.

చివరకు ప్యూన్లు కూడా వద్దంటున్నా వినకుండా తలా ఓ పది రూపాయలు చందా వేసుకొన్నారు. అలాంటిది ఆఫీసరు ఇవ్వకబోవడం బాగాలేదనిపించిన వెంకటేశం మళ్ళీ "సార్" అన్నాడు హీనస్వరంతో.

"ఏమయ్యా. నీక్కాదు చెప్పేది. వెళ్ళమంటే వెళ్ళవేం. పైసా ఇచ్చేది లేదు ఫో" అంటూ కోపంగా ముష్టివాడ్ని విదిలించినట్లు విదిలించి పారేసాడు.

దాంతో వెంకటేశం తోక ముడిచి బతికుంటే బలుసాకు తినొచ్చు అనుకొంటూ సింహం నోట్లో పడబోయి కొద్దిలో తప్పించుకున్న కుందేలులా పరుగెత్తుకు వచ్చి హాల్లో పడ్డాడు. హాల్లో పడ్డ తరువాత గుండెల మీద చేయి ఉంచుకొని హాయిగా గాలిపీల్చి వదిలాడు.

ఆ సాయంత్రం ఆరు గంటలప్పుడు కొంతమంది స్టాఫు సెలవులో ఉన్న ఆనందరావు ఇంటికి వెళ్ళి తాము చందా వేసికొని తెచ్చిన డబ్బిచ్చారు.

తరువాత ఆఫీసరు నిరంకుశత్వాన్ని గురించి చర్చిస్తున్న స్టాఫు, సదరు ఆఫీసరుగారి కారు నేరుగావచ్చి ఆనందరావు ఇంటిముందు ఆగడం, అందులోంచి సాక్షాత్తు ఆఫీసరు దిగి నడుచుకొంటూ రావడంతో అందరూ దిమ్మెరపోయారు.

అందరూ లేచి నిలబడి భయంగా ఆఫీసర్ని విష్‌చేసారు. ఆయన వస్తాడని వాళ్ళూహించలేదు, వాళ్ళుంటారని ఆయననుకోలేదు. నవ్వుతూ చేయెత్తి 'కూర్చోండి, కూర్చోండి' అన్నట్లు సైగ చేసాడు. ఆనందరావు

పక్కింట్లోంచి మంచి కుర్చీ ఒకటి తెద్దామని ప్రయత్నిస్తూ ఉంటే అగమని సైగచేసాడు.

ఆశ్చర్యంగా చూస్తున్న ఆనందరావు భుజం తట్టి తన జేబులోంచి కవరు తీసి అతని చేతిలో పెట్టాడు.

"ఆనందరావ్! ఇది నా నెల జీతం నాలుగువేల రెండు వందలా యాభయ్ రూపాయలు. నాకు పిల్లలు లేరు. నాకొచ్చే జీతానికి ఒక నెల జీతం లేకపోయిన బతగ్గలను. నేన్నికి డబ్బు ఆనందంగా ఇస్తున్నాను. నీ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఫైర్ సర్వీసు వాళ్ళతో ఫోన్‌లో మాట్లాడి మంటలు ఆర్పేసారని తెలుసుకొన్నాను. అందుకే ఆఫీసు స్టాపుకు పర్మిషన్ ఇవ్వలేదు. ఎందుకంటే జరిగింది ఎలాగు జరిగిపోయింది ఇక వీళ్ళ పని ఎగగొట్టి వచ్చి ఇక్కడ చేసేదేమీ ఉండదు. బాధల్లో ఉన్న నిన్ను ఇంకా బాధపెట్టడం తప్ప నువ్వేం కంగారు పడకు. హౌస్ రిపేరు చేసుకోడానికి లోను ఇప్పిస్తాను" అంటూ భుజం తట్టి ఓదార్చాడు.

ఆనందరావు వెంటరాగా చనువుగా ఇంట్లోకి వెళ్ళి అతని భార్యని పిల్లల్ని ఓదార్చి, బయటికి వచ్చి కారెక్కి వెళ్ళిపోయాడు.

ఆఫీసరు వెళ్ళిన తరువాత అతనెంత సహృదయుడో వాళ్ళకిప్పుడు అర్థమయింది.

ఆ రోజు ఆఫీసరు సెలవు ఇవ్వకపోయినా కోపంతో సెలవుచీటి పోస్టులో వేసి రామచంద్రయ్య భార్యాపిల్లలతో తిరుమలకు వెళ్ళాడు. అది జనవరి నెల కావడంతో హిల్స్‌మీద చలిమరీ ఎక్కువ. తిరుమల నుంచి ఇంటికి వచ్చేసరికి పిల్లవాడికి నిజంగానే చలిజ్వరం వచ్చింది. దాని కోసం మరోవందరూపాయలు ఖర్చయింది పెద్దవాడైన ఆఫీసర్ మాట విననందుకు శాస్త్రి అని అనుకొన్నాడు రామచంద్రయ్య.

రంగారావుకు కూడా అలాంటి అనుభవమే ఎదురయింది. ఆఫీసర్ ఫెస్టివల్ అడ్వాన్స్ ఆ నెలలో శాంక్షన్ చేయకుండా మరుసటి నెలలో శాంక్షన్ చేయడం అతనికి ఎంతో మేలు చేసింది. మరుసటి నెలలో కాన్పుకు వచ్చిన కుమార్తెకు అప్పులు లేకుండా ఈ అడ్వాన్స్ డబ్బుతో కాన్పు చేయించాడు.

అదే విధంగా ఆ నెలలో రంగనాథం పేరు ప్రమోషను లిస్టులో హైదరాబాదుకు పోనందున మిగతా ఆఫీసుల నుంచి వచ్చిన లిస్టులలోకి వారికి ప్రమోషనువిచ్చి మారుమూల ఏరియాలకు వేసారు. మరుసటి నెలలో రంగనాథం పేరు పంపడం అతనికి ప్రమోషనిచ్చి అదే నెలలో అదే ఆఫీసులో రిటైరవుతున్న జయరాం ప్లేసులో వేయడం జరిగింది. దీంతో రంగనాథానికి దూరప్రాంతానికి ట్రాన్స్ఫర్ తప్పింది. ప్రమోషనుకు ప్రమోషనూ వచ్చింది.

ఇలా ఎవరికివారు తమకు నష్టం కలిగిందనుకొన్న విషయాల వెనుక దాగిన లాభాల గురించి ఆలోచించుకోసాగారు.

పనసపండు పైకి ముళ్ళతో కఠినంగా ఉంటుంది. కాని లోపల మెత్తగా, తియగా ఉంటుంది. అలాంటి వ్యక్తే ఆఫీసరు.

పైకి కనుపించే ఆయన దానవత్వం వెనుక ఉన్న మానవత్వం ఆ వెనుక దాగియున్న దయాగుణం వాళ్ళకి అర్థమవసాగింది.

ఇప్పుడు ఆయన కర్కోటకుడుకాదు, 'కరుణామయుడు'.

*